క్లుప్తంగా

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



కొత్తపల్లిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగ పడతాయని గణపవరం ఎంపీడీవో ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం కొత్తపల్లి, వరదరాజపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌లు మద్దాల రత్నకుమారి, జి.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మద్దాల నాగేశ్వరరావు, మద్దాల మధు, సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు. వైద్యాధికారులు కిరణ్మయి, కావ్యశ్రీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరంలో సదుపాయాలు, మందులు పంపిణీ, సుగర్, రక్త పరీక్షలు, రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను ఎంపీడీవో, సర్పంచ్‌లు పరిశీలించారు. సుమారు 330 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం



బాపిరాజుగూడెంలో నూతనంగా వేస్తున్న గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం బాపిరాజుగూడెం గ్రామ పంచాయతీ, కొత్త సచివాలయం నుంచి ధర్మాజీగూడెం మెయిన్ రోడ్డు వరకు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

రోడ్డు నిర్మాణం పూర్తి



దెందులూరు కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డు

దెందులూరు: స్థానిక కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. రూ.70 లక్షల నిధులు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మంజూరు చేయడంతో కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డును పూర్తి చేశారు. దీంతో దెందులూరు, సీతంపేట, సత్యనారాయణపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోఆపరేటివ్ బ్యాంకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంపై పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, తొత్తడి వేదకుమారి, కొలుసు గణపతిరావు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



నారాయణపురంలో పేదలకు పంచే కిట్లను పరిశీలిస్తున్న సినీ సింగర్ సునీత

ఉంగుటూరు: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రముఖ సినీ గాయకురాలు యు.సునీత అన్నారు. శుక్రవారం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి డిస్ట్రిక్ట్ మహిళా సాధికారత చైర్‌పర్సన్ శరణాల మాలతీరాణి అధ్యక్షత వహించారు. పేదలకు పంపిణీ చేయనున్న కిట్లను సునీత ప్రారంభించారు. లయన్స్ గవర్నరు గట్టి మాణిక్యాలరావు, మెంబర్లు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులకు మహర్దశ

- దశాబ్దాల సమస్యకు మోక్షం
- నిండుకుండల్లా కళకళలాడుతున్న చెరువులు

గణపవరం: దశాబ్దాల కాలంగా తవ్వకాలు లేక, పూడుకుపోయి, కాలుష్య కాసారాలుగా మిగిలిన మంచినీటి చెరువులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మహర్దశ పట్టింది. రూ.లక్షల వ్యయంతో మంచినీటి చెరువులను అభివృద్ధి చేయడంతో అవి కొత్తరూపును సంతరించుకున్నాయి. దీనితో ఆయా గ్రామాల్లో ప్రజలు ఇంతకాలం ఎదుర్కొన్న మంచినీటి సమస్యలకు తెరపడింది. మరో మూడు దశాబ్దాల వరకూ చెరువుల గురించి ఆలోచించే అవసరం లేకుండా పూర్తి స్థాయిలో లోతుచేసి, గట్లు బలోపేతం చేశారు.

మంచినీటి చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామాల్లో మంచినీటి చెరువులను అభివృద్ధి చేయకపోవడంతో చాలా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువులు పూడుకుపోయి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ప్రజలకు సరిపడ మంచినీరు సరఫరా చేయడం గ్రామ పంచాయతీలకు తలకు మించిన భారంగా మారింది. దీనితో చాలా గ్రామాల్లో ఒక పూట, విడతల వారీగా నీరు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో మంచినీటి చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో 10 గ్రామాల్లో 12 చెరువుల ప్రక్షాళనకు ప్రతిపాదనలు చేయించి, సుమారు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారు. అభివృద్ధి చేయడంతో చెరువులు నీటితో నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి.



గణపవరం సువర్ణగుండం చెరువు తవ్వకం పనుల (ఫైల్)

గణపవరంలో నాలుగు చెరువుల తవ్వకం

గణపవరంలో సువర్ణగుండం చెరువును రూ.15 లక్షలు, బాలయ్య చెరువును రూ.20 లక్షలు, గాంధీ చెరువును రూ.4 లక్షలు, ఎస్సీపేట చెరువును రూ.4 లక్షలతో తవ్వకం పూర్తి చేశారు. బువ్వనపల్లిలో సుమారు ఐదు దశాబ్దాల క్రితం తవ్విన మంచినీటి పూడుకుపోయింది. ఈ చెరువును సుమారు రూ.30 లక్షలతో పూర్తిస్థాయిలో తవ్వడంతో చెరువు కొత్త రూపు సంతరించుకుంది. జల్లికొమ్మరలో మంచినీటి చెరువు అడుసు, బురదతో నిండి, నీరు కాలుష్యానికి గురవడంతో ఆ నీటిని తాగిన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. నాలుగేళ్లపాటు గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. చెరువును ఇటీవల రూ.15 లక్షల వ్యయంతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. అర్ధవరం చెరువును రూ.8 లక్షలు, ఎస్.కొండేపాడులో రూ.5 లక్షలతో కొత్తచెరువును, వాకపల్లి మంచినీటి చెరువును రూ.15 లక్షలతోను, వల్లూరు మంచినీటి చెరువును రూ.5 లక్షలతో, అడవికొలను మంచినీటి చెర్వును రూ.30 లక్షలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ఉంగుటూరు మండలం దొంతవరంలో ప్రజల అవసరాలకు మంచినీటి చెరువు సరిపోకపోవడంతో పక్కనున్న పశువుల చెరువును కలిపి రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశారు. ఈ చెరువులకు ఇటీవల ఎమ్మెల్యే వాసుబాబు పూజలు చేసి కొత్త నీరు నింపారు. దశాబ్దాలుగా నెలకొన్న మంచినీటి చెరువుల సమస్యకు మోక్షం కల్పించిన ఎమ్మెల్యే వాసుబాబుకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తరూపు సంతరించుకుని నీటితో కళకళలాడుతున్న బువ్వనపల్లి మంచినీటి చెరువు

నీటి సమస్య పరిష్కారం



మా గ్రామంలో ప్రధాన మంచినీటి చెరువు యాభై ఏళ్ల క్రితం తవ్వారు. ఇప్పటివరకూ కనీసం పూడిక తీయలేదు. చెరువు పూర్తిగా పూడుకుపోయింది. చెరువు అడుగున బురదచేరి, చెరువులో నీరు తరచూ పాడవుతోంది. ఈ సమస్య ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతీసుకుని చెరువు తవ్వకానికి నిధులు మంజూరు చేయించడంతో అభివృద్ధి చేసుకున్నాం.

– కిలారు సత్యవతి, సర్పంచ్, బువ్వనపల్లి

రూ.44 లక్షలతో అభివృద్ధి పనులు



గణపవరం పట్టణానికి మంచినీటి సమస్య మూడు దశాబ్దాలుగా పట్టి పీడిస్తోంది. ప్రధాన మంచినీటి చెరువులు మూడూ పూర్తిగా పూడుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఎస్సీ ఏరియాలో మంచినీటి చెరువు గుర్రపుడెక్కతో నిండి నిరుపయోగంగా ఉంది. ఈ సమస్యను ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి తీసుకెళ్లగా రూ.44 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో నాలుగు చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం.

– మూర అలంకారం, సర్పంచ్, గణపవరం

తాగు నీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి గ్రామాల్లో మంచినీటి సమస్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాను. నియోజకవర్గం ఎక్కువగా కొల్లేరు ప్రాంతం కావడం, ఆక్వా పరిశ్రమ విస్తారంగా ఉండటంతో మంచినీటి వనరులు కాలుష్యం బారిన పడి ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందుకే ప్రతి గ్రామంలో ఫిల్టర్ బెడ్ల వినియోగం, కొత్త ఫిల్టర్ల నిర్మాణం, మైక్రో ఫిల్టర్ల ఏర్పాటు, ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు, పైపులైన్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చాను. జలజీవన్ మిషన్ పథకంలో దాదాపు రూ.100 కోట్లతో గ్రామాల్లో మంచినీటి సమస్య తీరుస్తున్నాం.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

పోలియోను తరిమికొడదాం

భీమడోలు: పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలంటూ శుక్రవారం సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు పురవీధుల్లో ఉపాధ్యాయులు, వైద్య శాఖ సిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీ, ప్రదర్శన చేసారు. పోలియో చుక్కలు వేయిద్దాం, పోలియోను తరిమి కొడతామంటూ నినాదాలు చేసారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు విధిగా ఈనెల 3వ తేదీ ఆదివారం పోలియో కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయించాలని కోరుతూ నినాదాలు చేసారు. ఆరోగ్యవంతమైన సమాజస్థాపనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూరుశాతం పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్, ఆశావర్కర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

రూ.కోటి నిధుల దుర్వినియోగంపై అధికారుల పరిశీలన

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో రూ.కోటి పైగా నిధుల దుర్వినియోగం అంశంపై పరిశీలన చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ పరిశీలన నిమిత్తం ప్రస్తుత గ్రామ కార్యదర్శి పూర్వపు గ్రామ కార్యదర్శి, సర్పంచ్‌లను హాజరుకావాలని సూచించారు. గ్రామానికి చెందిన చిలికి శేఖర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంప జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలో అధికారులు విచారణ చేసి నిధుల దుర్వినియోగమయ్యాయని నిర్ధారించారు. ఇటీవల దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ చెక్‌పవర్‌ను రద్దు చేశారు. కలెక్టర్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించడంతో జంగారెడ్డిగూడెం డీఎల్‌పీఓ కార్యాలయంలో రికార్డులు, స్టేట్‌మెంట్లు, రశీదులను అధికారులు పరిశీలించనున్నారు.

టీడీపీ సాధికార మిత్ర చేతివాటం

- ఇంటి పట్టాపై అందిన రుణం, ఉపాధి కూలీ రూ.3.05 లక్షలు స్వాహా
- వైఎస్సార్ సీపీ నేతలు, బాధిత కుటుంబం ఆగ్రహం

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలం మలకచర్లలో టీడీపీ సాధికార మిత్ర గొట్టాపు సాయికృష్ణ మోసాలు ఒక్కొక్కటి ఆధారాలతో వెలుగు చూస్తున్నాయి. శుక్రవారం బాధిత కుటుంబం చోడవరపు వెంకటలక్ష్మి, కుమారుడు వెంకన్న, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని వెంకట్రాజు, నరేంద్ర బాబ్జి తదితరులు గొట్టాపు సాయికృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు చోడవరపు వెంకటలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ సాధికార మిత్ర భీమడోలు ఎస్‌బీఐ నుంచి విత్‌డ్రా చేసిన సొమ్ము వివరాలను వాటికి సంబంధించిన ఆధారాలను చూపించారు. వెంకటలక్ష్మికి భీమడోలు ఎస్‌బీఐలో అకౌంట్ ఉంది. ఆమె అకౌంట్ నంబర్‌కు ఫోన్ నంబర్ లింక్ అయింది. ఆ అకౌంట్‌లో గత నెల 5న జగనన్న ఇంటి పట్టాపై ప్రైవేటు ఫైనాన్స్ నుంచి మంజూరైన రుణం 2.90 లక్షలు జమ అయింది. ఈ విషయం తెలుసుకున్న మలకచర్ల గ్రామానికి చెందిన టీడీపీ సాధికార మిత్ర గొట్టాపు సాయికృష్ణ వచ్చి రుణం మంజూరుకు అని మాయమాటలు చెప్పి వెంకటలక్ష్మి ఫోన్‌ను, బ్యాంకు పాసుపుస్తకం, ఏటీఎం, జగనన్న స్థలం పట్టాను తీసుకున్నాడు. అనంతరం విడతలుగా ఆమె ఖాతాలోని రూ.2.90 లక్షలు విత్‌డ్రా చేసి ఇతర ఖాతాలకు బదిలీ చేశాడు. రుణం అందించిన ప్రైవేటు ఫైనాన్స్ సిబ్బంది నాగరాజు తదితరులు వెంకటలక్ష్మి ఇంటికి వచ్చి రుణం మంజూరైందని ఎస్‌బీఐ ఖాతాకు జమ చేశామని చెప్పారు. ఆమె బ్యాంకు అకౌంట్ తనిఖీ చేయగా గత నెల 5 నుంచి రూ. 2.90 లక్షలు ఇతర ఖాతాలకు బదిలీ చేసి ఉంది. విషయం తెలుసుకున్న బాధితురాలు అవాక్కై సాయికృష్ణను నిలదీసింది. సాయికృష్ణ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడంతోపాటు పంచాయతీ నుంచి కుళాయి నీరు రాకుండా అడ్డుకుంటున్నాడని బాధితురాలు చోడవరపు వెంకటలక్ష్మి కన్నీటి పర్యంతమైంది. రుణం రూ. 2.90 లక్షలతోపాటు తమ ఉపాధి కూలీ వేతనం రూ.15 వేలు కూడా డ్రా చేశాడని వాపోయారు. పూర్తి ఆధారాలు లభించాక దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.



మలకచర్లలో టీడీపీ సాధికార మిత్ర చేసిన మోసాలకు సంబంధించి ఆధారాలు చూపుతున్న బాధిత కుటుంబం

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఫిర్యాదు చేస్తాం

మలకచర్లలో టీడీపీ సాధికారమిత్ర గొట్టాపు సాయికృష్ణ గతంలో ఫోన్ డేటా, ఓటీపీ చౌర్యం చేశాడని వెంకటలక్ష్మి అకౌంట్‌లో రుణం డబ్బు, ఉపాధి కూలీ సొమ్ము డ్రా చేసి మోసం చేశాడని వైఎస్సార్ సీపీ నేతలు పర్వతనేని వెంకట్రాజు, నరేంద్ర, బాబ్జి, పేరం ప్రసాద్, పుల్లా శివప్రసాద్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు అన్నారు. బ్యాంకు పాసు పుస్తకం, ఫోన్ పే, ఏటీఎం కార్డు తదితర వివరాలు చూపించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని మాట్లాడుతూ న్యాయం జరిగే వరకూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- చివరి నిమిషంలో పరుగులు తీసిన విద్యార్థులు
- మండలంలోని రెండు కేంద్రాల్లో 402 మంది హాజరు

భీమడోలు: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జూనియర్ ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా ఒక్క నిమిషం అలస్యమైనా పరీక్షా కేంద్రానికి విద్యార్థులను అనుమతించలేదు. దీనితో చివరి నిమిషంలో వచ్చే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు పరుగులు తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేసారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రం లోపలకు అనుమతించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసారు. సెల్‌ఫోన్లు అనుమతించలేదు. మండలంలోని భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లోని పరీక్షలు సీసీ కెమెరా నిఘాలో నిర్వహించారు. తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 233 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరు కాగా 228 మంది పరీక్షలు రాసారు. శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 179 మందికి ఐదుగురు గైర్హాజరు కాగా 174 మంది పరీక్షలు రాసారు. కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచారు. పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సహాయం చేసారు. శనివారం సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.



భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాలలో రూమ్ నంబర్లు పరిశీలిస్తున్న విద్యార్థులు



భీమడోలులో హాల్ టికెట్లు చెక్‌చేసి పంపుతున్న పోలీసులు, మహిళా లెక్చరర్లు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు మెదటి రోజు పరీక్షలు రాశారు. మెత్తం 140 మంది విద్యార్థులకు 9 మంది గైర్హాజరయ్యారు. 131 మంది పరీక్ష రాశారు. మహాత్మాగాంధీ, గీతాంజలి కళాశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

పెదవేగి: కడుపునొప్పితో బాధపడుతున్న బాలిక ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కొండలరావుపాలేనికి చెందిన కటారి సుబ్బలక్ష్మి పదో తరగతి చదువుతోంది. ఆ బాలికకు కొంతకాలంగా తరచుగా కడుపునొప్పి వస్తోంది. గత నెల 28న రాత్రి కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ఇంట్లో ఉన్న ఎలుకలను చంపడానికి తీసుకొచ్చిన మందును నీళ్లలో కలుపుకుని తాగేసింది. దీనిని గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలిక కటారి సుబ్బలక్ష్మి (15) శుక్రవారం ఉదయం మృతి చెందింది. శవపంచనామా అనంతరం శవపరీక్ష నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఈ- క్రాప్ నమోదు జాబితా సిద్ధం

ఉంగుటూరు: ఈ- పంట నమోదు మండలంలో పూర్తయ్యిందని వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ వెల్లడించారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతుల జాబితాలను ప్రదర్శించారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకురావాలని వాటిని సరి చేస్తామని తెలిపారు. మండలంలో 24,453 ఎకరాలు వరి పంట 9,739 మంది రైతులు పేరిట నమోదు చేశామని ఏవో వెంకటేష్ వివరించారు. ఇతర పంటలు కూడా ఈ క్రాప్ బుకింగులో నమోదు చేశామని తెలిపారు.

రైతులు పంట నమోదు వివరాలు సరిచేసుకోవాలి

పెదపాడు: రబీ సీజను 2023లో రైతులు పంట నమోదుకు సంబంధించి వివరాలను ప్రచురించామని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని రైతులంతా రబీ సీజన్‌కు సంబంధించిన వేసిన పంట వివరాలు, రైతుల వివరాలు అన్ని ఆర్‌బీకేల వద్ద శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రదర్శిస్తారని చెప్పారు. శనివారం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గ్రామ సభ నిర్వహించి పంట నమోదులో ఎలాంటి తప్పులున్నా వాటిపై ఫిర్యాదులు తీసుకుని సరి చేస్తామని తెలిపారు.



ఎ.గోకవరం ఆర్‌బీకే వద్ద జాబితాను ప్రదర్శిస్తున్న దృశ్యం

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి మూల స్తంభాలు

నిడమర్రు: వైఎస్సార్ సీపీకి క్షేత్రస్థాయిలోని కార్యకర్తలే మూల స్తంభాలని ఆ పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు. శుక్రవారం దేవరగోపవరంలో ఎన్నికలకు మేము సిద్ధం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాడి రత్నశేషారావు (అబ్బులు) మాట్లాడుతూ గ్రామ ఎన్నికల పరిశీలకుడిగా తనను ఎమ్మెల్యే వాసుబాబు నియమించారన్నారు. నా బాధ్యతగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దేవరగోపవరంలో వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేస్తానన్నారు. 2019 ఎన్నికల్లో నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన నవరత్న హామీలన్నీ అమలు చేసిన విషయం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జెడ్పీటీసీ కోడే కాశి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వాసుబాబుని, జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా చేసేందుకు గ్రామపార్టీ శ్రేణులు కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, మాజీ సర్పంచ్ తుమ్మూరి కృష్ణారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మద్దిరాల బుజ్జి, మాజీ ఉపసర్పంచ్ కందులపాటి మహేష్, చోడగిరి నాగబాబు, బలే శ్రీను, కొమ్మన శ్రీను, కోటిపల్లి నాగేశ్వరరావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంకు సత్యకుమార్

'విజయకేతనం' పుస్తకాలతో మంచి ఫలితాలు

నిడమర్రు: జిల్లా పరిషత్ నుంచి ఎస్ఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించిన విజయకేతనం పుస్తకాలు చదివితే పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో కె. రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు జెడ్పీ స్కూల్లో నిర్వహిస్తున్న వారంతపు పరీక్షను ఎంఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం జాకబ్‌రాజు, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధన పాటించాలి

ఉంగుటూరు: బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని తహసీల్దారు వెంకటశివయ్య అన్నారు. శుక్రవారం ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి దుర్గప్రసాదు, ఎన్నికల డీటీ పోతురాజు పలు అంశాలు వివరించారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల పంపిణీ



నిడమర్రులో డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

నిడమర్రు: పేదలకు ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల పంపిణీ మండలంలో చురుగ్గా సాగుతోంది. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో ఈ కార్డుల పంపిణీ చేశారు. నిడమర్రులో నిర్వహించిన పంపిణీలో ఈవోపీఆర్డీ వి.చంద్రశేఖరం పాల్గొని మాట్లాడారు ఈ పథకంలో ప్రతి ఒక్కరికీ రూ.25లక్షల వరకూ ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం భరిస్తుందన్నారు. మండలంలో 22వేల డిజిటల్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ డిజిటల్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల కోసం తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామ వలంటీర్లు మీ వద్దకే వచ్చి ఈ కార్డులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు సచివాలయ కార్యదర్శి టి. నరసింహస్వామి, వలంటీర్లు పాల్గొన్నారు